నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 22 మే 2024 | BHADRADRI KOTHAGUDEM

నిరుద్యోగుల గొంతుక రాకేశ్‌రెడ్డిని గెలిపించండి..

- పట్టభద్రులు ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయండి
- భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

భద్రాచలం, మే 21 : నిరుద్యోగుల గొంతుక ఏనుగుల రాకేశ్‌రెడ్డిని శాసన మండలికి పంపేందుకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిట్స్ పిలానీలో ఉన్నత విద్యను అభ్యసించిన వ్యక్తి ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారని, ఆయనకు కేసీఆర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారన్నారు. రాకేశ్‌రెడ్డిని గెలిపించుకుంటే నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై ప్రశ్నిస్తారన్నారు. అదే కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటేస్తే ప్రశ్నించడం పక్కనపెట్టి.. ప్రభుత్వాన్ని ప్రశంసించడమే పనిగా పెట్టుకుంటాడన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చిన గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని, రైతు రుణమాఫీ ఏమైందో ఇంకా తెలియడం లేదన్నారు. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకు, అధికారం దక్కించుకునేందుకు మాత్రమే హామీలను కుమ్మరించారన్నారు. ఈ నెల 27న జరిగే నల్లగొండ-ఖమ్మం-వరంగల్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, మణుగూరు జడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి వెంకటరమణారెడ్డి, మండల నాయకులు ఆకోజు సునీల్, దానియేలు ప్రదీప్, అయినాల రామకృష్ణ, ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశవాది తీన్మార్ మల్లన్నను ఓడించాలి

జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

24న బోనకల్లుకు మాజీ మంత్రి హరీశ్‌రావు రాక

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిర, మే 21 : బ్లాక్ మెయిలర్, అవకాశవాది తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించి.. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి పట్టం కట్టాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు కోరారు. మంగళవారం నియోజకవర్గంలోని మధిర, బోనకల్లు, ముదిగొండ, చింతకాని మండలాల్లో నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నియోజకవర్గ సమన్వయకర్త బిచ్చాల తిరుమలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పలు పార్టీల నాయకులు, అధికారులను బ్లాక్‌మెయిల్ చేసిన ఘనుడన్నారు. నిస్వార్థపరుడు, విద్యావంతుడైన ఏనుగుల రాకేశ్‌రెడ్డిని పట్టభద్రులు అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. మధిర నియోజకవర్గ సమన్వయకర్త బిచ్చాల తిరుమలరావు మాట్లాడుతూ ఈ నెల 24న బోనకల్లులోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల ఓటర్ల సమావేశం జరుగుతుందని, దీనికి మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావుతోపాటు ముఖ్య నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్లు చిత్తారు నాగేశ్వరరావు, బంధం శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జునరావు, రావూరి శ్రీనివాసరావు, వాచేపల్లి లక్ష్మారెడ్డి, కనుమూర వెంకటేశ్వరరావు, పంబి సాంబశివరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, మోదుగుల నాగేశ్వరరావు, కటికల సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపిస్తే నా గౌరవ వేతనం నిరుద్యోగులకే ఖర్చు చేస్తా

– ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి

పట్టభద్రుల ఎమ్మెల్సీగా నన్ను గెలిపిస్తే ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం నిరుద్యోగుల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తా. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌కు పత్రాలు ఇచ్చి మేము ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం కాంగ్రెసోళ్లకే చెల్లింది. డిసెంబర్ 9న హామీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ సర్కారు మాటలు ఏమాయ్యాయి? ఐదు నెలలైనా ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్, డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి, ఉద్యోగులకు పీఆర్సీ ఎందుకు ఇవ్వలేదు. జీఓ 46 ద్వారా కొంత మందికి అన్యాయం జరిగితే బీఆర్ఎస్ ప్రభుత్వం సరిదిద్దే సమయంలో ఎన్నికల కోడ్ వచ్చింది. అధికారంలోకి రాగానే రద్దు చేస్తామన్న కాంగ్రెస్ ఎందుకు చేస్తలేదు. విచక్షణ కలిగిన పట్టభద్రులు.. బ్లాక్ మెయిలర్స్ ఎవరో, మంచివారు ఎవరో ఆలోచించి ఓటు వేయాలి. చుక్కా రామయ్య నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి వరకు విద్యావంతులనే మండలికి పంపారు. జర్నలిజం ముసుగులో ఎర్నలిస్టుగా మారిన వ్యక్తులకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి.

కాంగ్రెస్‌కు ఓటు వేసి మళ్లీ మోసపోవద్దు

- ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిన నీచ చరిత్ర కాంగ్రెస్‌దే
- అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది
- బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నల్గొండ జిల్లాలో విస్తృత పర్యటన
- పాల్గొన్న మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నేతలు

నల్లగొండ జిల్లా హాలియాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

మిర్యాలగూడ, మే 21 : 'అసెంబ్లీ ఎన్నికల్లో అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇంతవరకూ ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేసి మళ్లీ మోసపోవద్దు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి బిట్స్ పిలానీలో గోల్డ్ మెడలిస్ట్, రచయిత, ఉద్యమకారుడు అన్నారు. అమెరికాలో ఫేస్‌బుక్ వంటి సంస్థల్లో ఉద్యోగం చేసి వాటిని వదులుకొని ప్రజా జీవితంలో అడుగుపెట్టిన ఉత్సాహవంతుడు అని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ విద్యావంతుల సైన్యమని, విద్యావంతులకు బీఆర్ఎస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. పదేండ్లలో నిష్ఠతో తెలంగాణను అభివృద్ధి చేశామని, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాగు, తాగునీరు, విద్య, వైద్యం, పట్టణ, గ్రామీణ అభివృద్ధి వంటి ఏ రంగంలోనైనా తనదైన ముద్ర వేసి తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిందని చెప్పారు. సమగ్ర, సమ్మిళిత, సమతుల్య, సమీకృత అభివృద్ధి సాధించేందుకు ముందుకెళ్లామన్నారు. 2014కు ముందు కరెంట్ ఉండేది కాదని, నీళ్లు ఉండకపోవడంతో బోరుబావులు ఫెయిల్ అయి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే పెట్టుబడులన్నీ వెళ్లిపోతాయని, కొత్తవి రావని ఆనాడు పుకార్లు పుట్టించారని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తొమ్మిదన్నరేండ్లలో ఐటీ రంగం అభివృద్ధిలో దూసుకుపోయిందని, బీఆర్ఎస్ హయాంలో పది లక్షల మందికి ఐటీ ద్వారా ఉద్యోగాలను కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. ఈసారి గెలిస్తే మిర్యాలగూడకు ఐటీ తీసుకొచ్చేవాళ్లమని తెలిపారు. ఐటీ ఎగుమతులను రూ.57వేల కోట్ల నుంచి రూ.2లక్షల కోట్లకు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఒక వైపు ఐటీ, మరోవైపు వ్యవసాయాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. 2014లో తెలంగాణ రాష్ట్రం వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలో 14వ స్థానంలో ఉండేదని, 2023లో కేసీఆర్ అధికారం కోల్పోయే నాటికి దేశంలో నెం.1గా నిలిచిందని అన్నారు. దేశం మొత్తంలో తెలంగాణ నెం.1 అయితే.. రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉన్నదని తెలిపారు. 2014 నాటికి నల్లగొండలో ఒక్క మెడికల్ కాలేజీ లేదని, కేసీఆర్ నాయకత్వంలో మూడు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని అన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా చేసుకొని బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నామని, పారిశ్రామిక రంగంలో వెలుగులు తీసుకొచ్చామని చెప్పారు. 24వేల కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి దాదాపు రూ.3.5లక్షల కోట్ల పెట్టుబడులను సాధించుకున్నామన్నారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకొని దేశంలోనే నెం.1గా నిలిచామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కేవలం 1.8శాతం ఓట్ల తేడాతోనే ఓడిపోయిందని, పని చేసి కూడా చెప్పుకోలేకపోవడంతోనే ఓటమి పాలయ్యామని తెలిపారు. పదేండ్లలో భారతదేశంలో అత్యధికంగా ప్రభుత్వ కొలువులు ఇచ్చింది తెలంగాణ రాష్ట్రమేనన్నారు. కానీ.. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ కొత్త జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి రాష్ట్రపతితో సంతకం పెట్టించి 95శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇచ్చారని తెలిపారు. 2లక్షల ఉద్యోగాలను ఇచ్చి కూడా బీఆర్ఎస్ చెప్పుకోలేదని, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇవ్వని 30వేల ఉద్యోగాలను తామే ఇచ్చినట్లు చెప్పుకొంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, గాడిద గుడ్డు మాత్రం వచ్చిందని విమర్శించారు. కేంద్రంలోని బడే భాయ్ నరేంద్ర మోదీ ఏటా నిరుద్యోగులకు 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్తే.. చోటే భాయ్ రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఏటా 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కృష్ణా నదిని కేంద్ర అజామాయిషీకి అప్పగించాలని కేసీఆర్‌పై పదేండ్లపాటు ఒత్తిడి తెచ్చినా అప్పగించలేదన్నారు. రేవంత్‌రెడ్డి వచ్చిన నెలలోనే దొంగచాటుగా సంతకం పెట్టి నాగార్జునసాగర్ ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పగించాడని విమర్శించారు. కేసీఆర్ నల్లగొండకు వచ్చి గర్జిస్తే.. తాము పెట్టలేదని బుకాయించాడన్నారు. మన ప్రాజెక్టులను కేఆర్ఎంబీ చేతుల్లో పెట్టకపోతే నీళ్లు కావాలని మాటిమాటికి కేఆర్ఎంబీకి ఎందుకు ఉత్తరాలు రాస్తున్నాడని ప్రశ్నించారు. మీ చేతుల్లోనే ఉంటే మీరే నీటిని విడుదల చేయొచ్చు కదా? అన్నారు. ఇటీవల కాలంలో 4.5 టీఎంసీల నీటిని సాగర్ నుంచి ఆంధ్రాకు తీసుకెళ్లినప్పటికీ ప్రశ్నించే గొంతుక అని చెప్పుకొనే కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న ప్రభుత్వాన్ని ఒక్కసారైనా ప్రశ్నించాడా? అని అడిగారు. 30వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతుంటే కిందికి 4.5 టీఎంసీల నీరు ఎలా పోతుందని ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించలేరని.. సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్ అనే ధోరణి ఉంటుందని ఆరోపించారు. ఇప్పుడు కావాల్సింది తెలంగాణ అధికార స్వరం కాదు.. ధిక్కార స్వరం, శాసన మండలిలో ప్రశ్నించే గొంతుక కావాలని సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే శాసనమండలిలో ప్రశ్నించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రైతులందరూ బ్యాంకులకు వెళ్లి రూ.2లక్షలు తెచ్చుకోండి.. అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చాడని, ఇప్పటి వరకూ చేయలేదని విమర్శించారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చెప్పిన ఆయన.. ఇప్పుడు ఆగస్టు 15 అంటున్నాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేనందునే ముఖ్యమంత్రి కనిపించిన దేవుళ్ల మీద ఒట్లు పెడుతున్నాడని ఎద్దేవా చేశారు. మొన్నటి వరకు ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే ఇస్తామని చెప్తున్నారని, ఈ మాట ఎన్నికల ముందు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. తెలంగాణలో 80శాతం దొడ్డు రకం ధాన్యమే పండిస్తారని తెలిపారు. మహిళలకు రూ.2500 భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారని, ప్రతి మహిళ అకౌంట్‌లో రూ.2500 నగదు వేస్తున్నామని కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ అబద్ధాలు చెప్తున్నారని అన్నారు. రూ.2లక్షల రుణమాఫీ, రూ.15వేల రైతుబంధు, కౌలు రైతులకు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, ఆటో డ్రైవర్లకు నెలకు రూ.వెయ్యి ఇస్తామని ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మోసాలకు పాల్పడుతూ పచ్చి అబద్ధాలు చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రులు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మరోసారి మోసపోకుండా శాసనమండలిలో ప్రశ్నించే గళం బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత, మాజీ ఐఏఎస్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న.. నయా నయీం..

- కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేస్తే బ్లాక్ మెయిలర్‌కు వేసినట్టే..
- బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిది మాత్రమే ప్రశ్నించే గొంతుక..
- అందుకోసం 'ఎమ్మెల్సీ' ఎన్నికల్లో ఆయనను గెలిపించండి
- అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలి
- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, మే 21: ఉమ్మడి నల్గొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న ఓ నయా నయీం అని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఆరోపించారు. ప్రజలను బ్లాక్‌మెయిల్ చేయడం, బూతులు మాట్లాడటం అతడి నైజమని అన్నారు. అలాంటి వ్యక్తికి మండలిలో కూర్చునే అర్హత లేదని స్పష్టం చేశారు. అతడికి ఓటు వేస్తే బ్లాక్ మెయిలర్‌కి వేసినట్లేనని తేల్చిచెప్పారు. ఖమ్మంలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

శాసనమండలిలో గొప్పగొప్ప వ్యక్తులు ఉంటారని అన్నారు. ఇదే నయోజకవర్గం నుంచి గతంలో చుక్కా రామయ్య, రాజు, దిలీప్‌కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి లాంటి వారు ఎన్నికై మండలికి గౌరవం తెచ్చారని గుర్తుచేశారు. అలాంటి మండలిలో బ్లాక్ మెయిలర్ మల్లన్న కూర్చుంటే మండలికి ఉన్న గౌరవం పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టభద్రులందరూ విజ్ఞతతో ఆలోచించి ఈ ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. బిట్స్ పిలానీలో ఇంజినీరింగ్ విద్యలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన రాకేశ్‌రెడ్డి.. అమెరికాలో ఉద్యోగం చేసేవాడని అన్నారు. స్వరాష్ట్ర ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే ఇక్కడికి వచ్చారని, దీంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయనను దీవించి పంపారని గుర్తుచేశారు. అతడు మాత్రమే మండలిలో ప్రశ్నించే గొంతుక అవుతాడని స్పష్టం చేశారు.

అన్ని రకాల వడ్లకూ రూ.500 బోనస్ ఇవ్వాలి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులు పండించిన అన్ని రకాల వడ్లకూ రూ.500 బోనస్ ఇవ్వాలని, ప్రతి గింజనూ అలాగే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత నెల 21న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా అన్ని రకాల వడ్లకూ బోనస్ ఇవ్వకుండా కేవలం సన్న రకాలకే బోనస్ ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ విధానాలను రైతులు గమనించాలని కోరారు. కాంగ్రెస్ పాలకులు ప్రతి విషయంలోనూ అబద్ధమాడతారనేందుకు ఇదే నిదర్శనమని స్పష్టంచేశారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీనే నెరవేర్చే పరిస్థితి లేకపోవడం దారుణమని అన్నారు.

రుణమాఫీ చేయలేదు కానీ ఇద్దరు మంత్రులకు బిల్లులు చెల్లించారు..

తెలంగాణ ఏర్పడకముందు రైతుల పరిస్థితి ఎలా ఉందో, పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉందో, ఇప్పటి కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉందో రాష్ట్రంలోని అన్నదాతలందరికీ తెలుసునని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వబోతే కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని అన్నారు. కానీ అదే కాంగ్రెస్ పాలకులు తాజా పార్లమెంటు ఎన్నికలకు ముందు రైతుబంధు ఎలా వేశారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం అనర్హులకు రైతుబంధు ఇస్తోందంటూ గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ పాలకులు.. మొత్తానికి రైతుబంధు లబ్ధిదారుల్లో 97 శాతం మంది చిన్న సన్న కారు రైతులే ఉన్నారన్న విషయాన్ని గుర్తించారని అన్నారు. రూ 2 లక్షల రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. 150 రోజులు అవుతున్నా దానిని అమలు చేయలేదని విమర్శించారు. కానీ తన క్యాబినెట్‌లో ఉన్న ఇద్దరు మంత్రులకు మాత్రం బిల్లులు మొత్తం చెల్లించారని ఆరోపించారు. రుణమాఫీ చేయకుండా దేవుళ్ల మీద ఒట్లు వేస్తూ కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులు కూరాకుల నాగభూషణం, వీరూనాయక్, మందడపు శంకర్‌రావు, పగడాల నరేందర్, బెల్లం వేణుగోపాల్, డోకుపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

డీఐఈవో రవిబాబు


మాట్లాడుతున్న డీఐఈవో రవిబాబు

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 21 : ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరిగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో రవిబాబు సీఎస్, డీవోలకు సూచించారు. మంగళవారం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎస్, డీవోలు, కస్టోడియన్లకు పూర్తిస్థాయి శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 42 పరీక్షా కేంద్రాల్లో మొదటి సంవత్సరం 10,352 మంది, ద్వితీయ సంవత్సరం 4,632 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల సీల్‌ను కేంద్రాల్లోని సీసీ కెమెరాల వద్ద ఓపెన్ చేయాలని, కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. సీఎస్‌లు, డీవోలు, డీఈసీ సభ్యులు వెంకటేశ్వరరావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

24న పాలి సెట్ ప్రవేశ పరీక్ష

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 21 : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కొరకు ఈ నెల 24న పాలి సెట్–2024 నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జాకీరుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, జిల్లా కేంద్రంలో 5 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 2,591 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు.

గంట ముందుగానే కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారన్నారు. ఇంజినీరింగ్ డిప్లొమా చేయాలనుకునే వారు గణితంలో 60 మార్కులు, ఫిజిక్స్ 30, రసాయన శాస్త్రం 30 మార్కులకు పరీక్ష రాయాల్సి ఉంటుందని, అగ్రికల్చర్, వెటర్నరీ డిప్లొమా చేయాలనుకునే విద్యార్థులు అదనంగా జీవశాస్త్రంలో మరో 30 మార్కులకు పరీక్ష రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కాగా.. ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్‌బీఐటీ కళాశాల, కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాల, డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల, బొమ్మ ఇంజినీరింగ్ కళాశాలలు కేంద్రాలుగా పరీక్ష జరగనున్నది.

3 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం ఎడ్యుకేషన్, మే 21 : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించని వారు రూ.50 ఆలస్య రుసుముతో పరీక్ష తేదీ రెండు రోజుల ముందు వరకు చెల్లించే వెసులుబాటు కల్పించారని పేర్కొన్నారు.

క్లినికల్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాలో ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ ఒకేషనల్ కోర్సులో మార్చి 2019 నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థులు క్లినికల్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి కె.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులు రూ.వెయ్యి చొప్పున ఆస్పత్రి పేరుపై డీడీ తీసి డీఐఈవో కార్యాలయంలో జూన్ ఒకటో తేదీలోగా సమర్పించాలని పేర్కొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

- వారికి సమస్యలు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలి
- ఆటంకాలు లేకుండా తాగునీరు సరఫరా చేయాలి
- ఇసుక అక్రమ రవాణాను పకడ్బందీగా నియంత్రించాలి
- గనుల శాఖలో రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అధికారుల సమీక్షలో ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్

ఖమ్మం, మే 21: జిల్లాలో ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు రానీయొద్దని, వారికి సమస్యలు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు జరపాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర గనులు, భూగర్భ శాఖల కార్యదర్శి స